పసుపు క్వింటాల్ @ 14,005

మెట్‌పల్లి, ఫిబ్రవరి 26: ఈ సారి పసుపు ధరలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడులు కాస్త తగ్గినా.. రేట్లు మాత్రం రోజురోజుకూ పైపైకి చేరుతున్నాయి. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు క్రయవిక్రయాలు జోరుగా సాగుతుండగా.. సోమవారం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.14,005 పలికింది. పసుపు కాడి (కొమ్ము)కు ఈ ధర పలుకడం ఈ సంవత్సరం ఇదే తొలిసారి. కనిష్ఠంగా రూ.5 వేలు పలికింది. పసుపు గోళ (మండ) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.11,511, కనిష్ఠంగా రూ.5,001, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.10,044, కనిష్ఠంగా రూ.6,060 పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 3,446 క్వింటాళ్ల పసుపు క్రయవిక్రయాలు జరిగినట్టు మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

వరంగల్‌లో దేశీ మిర్చి @ 42 వేలు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 26: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం దేశీ రకం మిర్చి ధర క్వింటాల్‌కు రూ.42 వేలు పలికింది. గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.42 వేలు, మధ్యరకం రూ.38 వేలు, కనిష్ఠంగా రూ.33 వేలు పలికింది. డిసెంబర్ నుంచి మిర్చి సీజన్ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 3,48,360 క్వింటాళ్ల మిర్చి మార్కెట్‌కు వచ్చింది. అందులో దేశీరకం మిర్చి 2,647 క్వింటాళ్లని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

'మహబూబ్‌నగర్' ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నామినేషన్లు 4 నుంచి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సోమవారం షెడ్యూల్ విడుదలైంది. కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామాతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మార్చి 4 నుంచి 11 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 12న నామినేషన్ల పరిశీలన, 14 వరకు ఉపసంహరణ గడువు ఇచ్చారు. 28న పోలింగ్, ఏప్రిల్ 2న విజేతను ప్రకటిస్తారు. ఈ నోటిఫికేషన్‌తో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి రానున్నది.

బీజేపీకి ఓట్లడిగే అర్హత లేదు

- 3 నెలల్లో తెలంగాణకు ఒక్క పైసా ఇవ్వలేదు
- నిధులు, పథకాలన్నీ గుజరాత్, ఉత్తరప్రదేశ్‌కే
- తెలంగాణ పట్ల మోదీకి చిన్నచూపు ఎందుకు?
- రాష్ట్రం కోసం కాంగ్రెస్ ఎన్నడూ కేంద్రాన్ని ప్రశ్నించదు
- తెలంగాణకోసం కొట్లాడే బీఆర్‌ఎస్‌కే అవకాశమివ్వాలి
- బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్

హైదరాబాద్, ఫిబవరి 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో బీజేపీ నేతలు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి ఓటు అడిగే నైతిక అర్హత, హక్కు లేదని అన్నారు. వివిధ రాష్ట్రాలకు గత నెల రోజుల్లో వేల కోట్ల నిధులు కేటాయిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. తెలంగాణకు ఒక్క పైసా కూడా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. దీనిపై బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో సోమవారం క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ ఎలక్షన్ టు కలెక్షన్ అన్నది బీజేపీ విధానంగా మారిందని విమర్శించారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను కేంద్రంఎందుకు అమలు చేయడంలేదని, ఈ విషయాన్ని కాంగ్రెస్ అడగటంలేదని ధ్వజమెత్తారు. పసుపు బోర్డు ప్రకటించినా దానిని ఎక్కడ ఏర్పాటు చేస్తారో ఇంత వరకు చెప్పడంలేదని అన్నారు. పార్లమెంటు ఎన్నికల కోసమే బీజేపీ రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. దేశంలోని అన్ని రామాలయాలు తిరిగిన మోదీకి భద్రాచలం రాముడు ఎందుకు గుర్తురాలేదని ప్రశ్నించారు. తెలంగాణ పట్ల మోదీకి చిన్నచూపు ఎందుకని మండిపడ్డారు. రెండు రోజుల వ్యవధిలోనే గుజరాత్‌లో లక్ష కోట్లతో మోదీ పలు పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. మరి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అరవింద్ తెలంగాణ ప్రజల ఓట్లు ఎట్లా అడుగుతారని నిలదీశారు. బీజేపీ బడా జూటా పార్టీ అని, తెలంగాణకు ఆ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి ఎజెండాగా తీసుకెళ్తామని చెప్పారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రాదని స్వయంగా రేవంత్‌రెడ్డి చెప్తున్నారని, అందుకే కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీని నిలదీస్తామని అంటున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం కొట్లాడే బీఆర్‌ఎస్‌కే పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గత మూడు నెలల్లో వివిధ రాష్ట్రాలకు మోదీ ఇచ్చిన నిధులు...

తేదీ	పనుల విలువ (రూ.కోట్లలో)	రాష్ట్రం
18/12/23	19,150	ఉత్తరప్రదేశ్
30/12/23	15,700	ఉత్తరప్రదేశ్
02/1/24	20,000	తమిళనాడు
03/1/24	1,150	లక్షద్వీప్
12/1/24	12,700	మహారాష్ట్ర
17/1/24	4,000	కేరళ
19/1/24	2,000	మహారాష్ట్ర
25/1/24	19,100	ఉత్తర ప్రదేశ్
03/2/24	68,000	ఒడిశా
04/2/24	11,000	అస్సాం
06/2/24	1330	గోవా
11/2/24	7300	మధ్యప్రదేశ్
16/2/24	9,750	హర్యానా
20/2/24	32,000	జము కశ్మీర్
22/2/24	50,500	గుజరాత్
23/2/24	13,000	ఉత్తరప్రదేశ్
25/2/24	48,000	గుజరాత్

పన్ను వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలి

- గనుల శాఖ విధించిన జరిమానాలు వసూలు చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): అన్ని శాఖలు పన్ను వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గత ఆర్థిక (2023-24) సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖల పన్ను వసూళ్లపై సోమవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖలో లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉన్నదని ప్రశ్నించారు. సుంకం చెల్లించని మద్యాన్ని పొరుగు రాష్ట్రాల నుంచి రాకుండా అడ్డుకోవాలని ఆదేశించారు. ప్రతి డిస్టిలరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ అమర్చి ట్రాకింగ్ చేయాలని, బాటిల్ ట్రాకింగ్ సిస్టం కూడా ఉండాలని అన్నారు. పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు చెప్పగా.. ఆదాయాన్ని తెచ్చే శాఖలకు సొంత భవనాలు లేకపోవడం సరికాదని సీఎం అన్నారు. అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. కంకరను రహదారులపై కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారని, అలా కాకుండా నగరంలో వివిధ ప్రదేశాల్లో ప్రభుత్వ స్థలాలను అందుకు వినియోగించాలని సూచించారు. ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం రూపొందించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన గనులపై గతంలో విధించిన జరిమానాలు వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. టీఎస్‌ఎండీసీతోపాటు గనుల శాఖలో పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏండ్లుగా తిష్టవేశారని, కొందరిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, వారిని వెంటనే బదిలీ చేయాలని ఆదేశించారు. సమీక్షలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 507 ఎంసీహెచ్ కిట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ఈ నెల 16న నాగర్‌కర్నూల్ జిల్లాలో 507 ఎంసీహెచ్ కిట్లు అందుబాటులో ఉన్నట్టు టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ తెలిపింది. 'పేరు మార్పు సరే.. కిట్ల సరఫరా ఏది?' అనే శీర్షికతో ఈ నెల 16న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంపై సంస్థ స్పందించింది. జిల్లాలో నెలకు సుమారు 1000 కిట్లు అవసరం కాగా, 500 కిట్లే అందుబాటులో ఉన్నాయని కథనంలో పేర్కొనగా.. 507 కిట్లు అందుబాటులో ఉన్నట్టు డీఎంహెచ్‌వో నివేదిక ఇచ్చినట్టు సంస్థ వెల్లడించింది. పలు పీహెచ్‌సీల్లో ఒక్క కిట్ కూడా లేదన్న ఆరోపణలను ఖండించింది. బిజినేపల్లి పీహెచ్‌సీలో 10, బొప్పల్లిలో 45, కోడేరులో 24, వగ్నూర్‌లో 8, వెల్దండలో 7, వెన్నచెర్లలో 15 కిట్లు అందుబాటులో ఉన్నట్టు వివరించింది. అవసరమైతే పీహెచ్‌సీలకు పంపిణీ చేసేందుకు జిల్లా దవాఖానలో 78 కిట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపింది.

అటవీ ఆక్రమణలను అరికడతాం: కొండా సురేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): అడవుల ఆక్రమణను అరికడతామని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని అటవీశాఖ ప్రధాన కార్యాలయమైన అరణ్య భవన్‌లో సోమవారం ఆమె అధ్యక్షతన జరిగిన ఆ శాఖ రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని, అదే సమయంలో చట్ట వ్యతిరేకంగా అడవుల ఆక్రమణ చేపడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గొత్తికోయ ప్రభావిత ప్రాంతాల్లో తదుపరి ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రై సిటీస్‌గా ఖ్యాతిగాంచిన వరంగల్, హన్మకొండ, కాజీపేట నగరాల్లో పచ్చదనం పెంపు, పార్కుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి కూడా సత్వర చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, పీసీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఎంసీ పర్గెయిన్, విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలూసింగ్ మేరు, జిల్లాల కన్జర్వేటర్లు పాల్గొన్నారు.

'వైల్డ్ ఫ్లేవర్స్' తేనె ఉత్పత్తి ఆవిష్కరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : సేంద్రియ ఉత్పత్తులను ఆదరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. అటవీ కళాశాల, పరిశోధనా సంస్థ(ఎఫ్‌సీఆర్‌ఐ) ఆధ్వర్యంలో శాస్త్రీయంగా పెంచుతున్న తేనెటీగల కేంద్రం నుంచి తయారు చేసిన ఆర్గానిక్(సేంద్రియ)తేనెను ఆమె సోమవారం ఆవిష్కరించారు. రైతులకు తేనెటీగల పెంపకం, ఆదాయ అభివృద్ధిపై శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్ శివారు ములుగులో ఉన్న ఫారెస్ట్ కాలేజీలో ప్రత్యేక తేనెటీగల పెంపకం, ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పినట్టు చెప్పారు. రైతులతో పాటు ఔత్సాహిక వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, మహిళలకు తేనెటీగల పెంపకంపై వారం రోజుల శిక్షణా కార్యక్రమాలను ఫారెస్ట్ కాలేజీ అందిస్తున్నదని వెల్లడించారు. సేంద్రియ పద్ధతుల్లో అభివృద్ధి చేసిన తేనెను 'వైల్డ్ ఫ్లేవర్స్' బ్రాండ్ పేరిట ఫారెస్ట్ కాలేజీ అందుబాటులోకి తెస్తున్నదని వివరించారు. ములుగు ఫారెస్ట్ కాలేజ్‌లో త్వరలో ఒక తేనె విక్రయ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు డీన్ ప్రియాంక వర్గీస్ తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్: దామోదర

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరం మెడికల్ వ్యాల్యూ టూరిజం డెస్టినేషన్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం పశ్చిమ ఆస్ట్రేలియా ప్రభుత్వ ఆరోగ్యశాఖ మంత్రి అంబర్ జడ్ సండర్సన్‌తో మంత్రి దామోదర భేటీ అయ్యారు. రాష్ట్రంలో మెడికల్, పారామెడికల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు వెస్టన్ ఆస్ట్రేలియాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పరస్పరం చర్చించుకున్నారు. అనంతరం మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏటా 8,515 మంది మెడికల్ గ్రాడ్యుయేట్స్, 6,880 మంది నర్సింగ్ గ్రాడ్యుయేట్స్, 22,970 మంది పారామెడికల్ కోర్సులు పూర్తి చేస్తున్నారని చెప్పారు. నర్సింగ్, పారామెడికల్ కోర్సులు పూర్తి చేసినవారికి తెలంగాణ ప్రభుత్వం టాంకాం (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్) ద్వారా మరింత శిక్షణ ఇచ్చి ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, టాంకాం సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, ఐపిహెచ్‌ఎఫ్ డైరెక్టర్ హైమావతి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో విశాలాక్షి, వెస్టన్ ఆస్ట్రేలియా హెల్త్ మినిస్టర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టేసీ హర్న్, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జోడి సౌత్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ: పొంగులేటి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 26: ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ : ఎమర్జింగ్ ఇష్యూస్, పాలసీ ఇంటర్వెన్షన్స్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాస్పెక్ట్స్' అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 23 వేల ఉద్యోగాలను ఇప్పటికే భర్తీ చేశామని, త్వరలోనే 11 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. వచ్చే నెల 2న వివిధ విభాగాలకు చెందిన ఆరు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయబోతున్నామని వెల్లడించారు. కీలక ఉపన్యాసకులుగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. సామాజిక ఉద్యమాలు, సామాజిక మార్పు, ప్రజాస్వామిక ప్రక్రియతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, ప్రముఖ పాత్రికేయుడు కే రామచంద్రమూర్తి, సదస్సు డైరెక్టర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత గణేశ్, ఓయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కే అర్జున్‌రావు, సోషియాలజీ విభాగం బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ విష్ణుదేవ్, సదస్సు కో-డైరెక్టర్ డాక్టర్ రామ్ బీనవేణి షెఫర్డ్, సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నాగయ్య, ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ, ప్రొఫెసర్ చెన్న బసవయ్య, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నుంచే పోటీ చేస్తా!

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. 'బీసీలకు చట్టసభల్లో సముచిత న్యాయం ఉండాలంటారు, బీసీ కులగణన జరగాలని చెప్తారు, మరి బీసీ నేతలకు సీట్లివ్వరా? బీసీలంటే ఓట్లేసే మిషన్లేనా? ఇంకా ఎన్నిరోజులు ఓపికగా భరించాలి? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం లోక్‌సభ టికెట్ అడుగుతున్న, కొత్తగా వచ్చినవాళ్లకు సీట్లిస్తామంటే ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తల పరిస్థితి ఏమిటి? అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో కూడా పట్టుకొని ఉన్నానని గుర్తుచేశారు. తొలుత పార్టీలో రేవంత్‌రెడ్డిని వ్యతిరేకించినా, పీసీసీ అధ్యక్షుడయ్యాక ఔట్‌రైట్ సపోర్టు చేశానని చెప్పారు. తనలా పార్టీ కోసం పనిచేసినవాళ్లు జాతీయ స్థాయిలో కూడా ఎవరూ ఉండరని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సీట్లు కాకుండా ఉన్న సీట్లన్నీ అప్పర్ క్లాస్ వాళ్లే తీసుకుంటున్నారని, మరి బీసీలకు సీట్లివ్వరా అని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో పోటీ చేస్తానంటే టికెటివ్వలేదని, ఇప్పుడు ఊరుకునే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. ఊరుకుంటే న్యాయం జరిగేలా లేదని పేర్కొన్నారు.

1990లోనే సీఎంను అయ్యేవాడిని..

పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా 1990లోనే తనను ముఖ్యమంత్రిని చేయాలని ఆనాడే రాజీవ్‌గాంధీ అనుకున్నారని, ఆనాడు తన వయసు కేవలం 41 ఏండ్లేనని, అప్పటి పార్టీ సీనియర్లు అడ్డుకున్నారని వీ హన్మంతరావు గుర్తు చేశారు. ఇప్పుడేమో వయసు మీదపడినా అవకాశాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోని పరిస్థితులను బయటకు చెప్తే.. 'కడుపు కోసుకుంటే పేగులు బయట పడ్తాయి' అన్నట్టుగా ఉంటుందని నర్మగర్భంగా చెప్పుకొచ్చారు. అందుకే తాను ఎక్కువగా మాట్లాడటం లేదని చెప్పారు. ఇటీవల పార్టీ తరపున రాజ్యసభ స్థానాన్ని కూడా అడగలేదని, ఖమ్మం సీటే కావాలని ఆనాడే అడిగానని, ఇప్పుడూ అడుగుతున్నానని చెప్పారు. టికెట్ అడిగేందుకు తనకు అన్నిరకాల అర్హతలు ఉన్నాయని వీహెచ్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో తనకే న్యాయం జరగకపోతే ఇక కార్యకర్తల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు.

నాగర్‌కర్నూల్ సీటు నాదే!

- సీఎం రేవంత్‌రెడ్డి కూడా భరోసా ఇచ్చారు
- ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ తనకే వస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు. తనకు టికెట్ వచ్చేందుకు పరిస్థితులన్నీ సానుకూలంగా ఉన్నాయని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారని చెప్పారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ప్రభుత్వ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశానని, దానిని ఇంకా ఆమోదించలేదని చెప్పారు. సోమవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని, ఎంపీ టికెట్‌కు, తన పదవికి సంబంధమే లేదని చెప్పారని, నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ రావడానికి ప్రయత్నిస్తానని సీఎం భరోసా ఇచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కోసం 35 ఏండ్లు పనిచేసిన తనకే టికెట్ ఇవ్వాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 100 సీట్లు కూడా దాటవని, కాంగ్రెస్‌కు 200 సీట్లు, ఇండియా కూటమికి 350 సీట్లు వస్తాయని చెప్పారు. ద్వారకలో సముద్రం లోపలికి వెళ్లి పూజలు చేశానని, కృష్ణుడికి నెమలిపింఛం సమర్పించానని చెప్పడం ద్వారా ప్రధాని మోదీ మరో డ్రామాకు తెరలేపారని విమర్శించారు. అక్కడ ద్వారక ఉన్నదని, కృష్ణుడు ఉన్నాడని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. ఎన్నికల వేళ రాముడి, కృష్ణుడి పేర్లను వాడుకుంటున్నారని విమర్శించారు.

గోబ్యాక్ కిషన్‌రెడ్డి

- ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ ఎదుట కాంగ్రెస్ నిరసన

మల్లాపూర్, ఫిబ్రవరి 26: విజయ సంకల్ప యాత్ర పేరుతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు అరుణ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కలిసి జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలో మూతపడిన చక్కెర కర్మాగారం సందర్శనకు ప్లాన్ చేశారు. దీనిని నిరసిస్తూ సోమవారం కర్మాగారం ఎదుట కిసాన్‌సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. 'గో బ్యాక్ కిషన్‌రెడ్డి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎంపీ ఎన్నికల దృష్ట్యా రైతులను మోసం చేసేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికే ప్రకటించిన పసుపు బోర్డుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ మునిగిపోతున్న పడవ: పైడి రాకేశ్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 26: దేశంలో కాంగ్రెస్ పార్టీ మునిగిపోతున్న రాష్ట్ర శాఖ చేపట్టిన విజయ సంకల్పయాత్రలో భాగంగా ఆయన జగిత్యాల జిల్లా కేంద్రంతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ ప్రాంతాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఆయా సభల్లో ఆయన మాట్లాడుతూ కల్లబొల్లి మాటల కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం కర్ణాటక, తెలంగాణాల మాత్రమే ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ వైపు ముస్లింలు, క్రిస్టియన్లు, పాకిస్థాన్, చైనావాళ్లు ఉన్నారని చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాహుల్‌ఖాన్‌కు, అయోధ్య శ్రీరాముడికి మధ్యే పోటీ అని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో దేశద్రోహులకు, దేశభక్తులకు మధ్య పోరాటం ఉంటుందని తెలిపారు. రేవంత్‌రెడ్డి చేతగాని, చేవలేని ముఖ్యమంత్రి కావడంతోనే హిందూ బిడ్డ అయిన ఎస్‌ఐపై మేడారంలో ఓ మైనార్టీ ఎస్పీ దాడి చేశాడని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర తెలంగాణను పగబట్టిందని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి మూడు నెలల్లో రూ.4,500 కోట్లు దోచుకొని పోయారని, ఎవడబ్బ సొమ్మని ఇంత డబ్బును తీసుకెళ్లారని ప్రశ్నించారు. నెలకోసారి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి సూట్‌కేసులు మోసుకెళ్తూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని సోనియా కాళ్ల దగ్గర తాకట్టు పెడుతున్నారని రాకేశ్‌రెడ్డి విమర్శించారు. ఈ రోడ్‌షోలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి, పడాల తిరుపతి, టౌన్ అధ్యక్షుడు రంగు గోపాల్, మదన్‌మోహన్, మండల అధ్యక్షుడు తిరుపతి, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీకి ఓటేయకుంటే దేశద్రోహులే: అర్వింద్

- కోరుట్లలో బీజేపీ ఎంపీ అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు

కోరుట్ల, ఫిబ్రవరి 26: రాజ్యాంగంలో సెక్యులరిజం అనే పదం పోవాలంటే మరోసారి నరేంద్రమోదీ ప్రధానిగా ఎన్నికవ్వాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సెక్యులరిజం పదాన్ని అంబేద్కర్ రాజ్యాంగంలో పెట్టలేదని, ఇందిరాగాంధీ దొంగతనంగా పెట్టిందని చెప్పారు. ఆ సెక్యులరిజం పోవాలన్నా, నూటికి నూరు శాతం హిందూ దేశం కావాలన్నా మోదీ మళ్లీ ప్రధానిగా ఎన్నిక కావాలని అన్నారు. భారతదేశంలో ఉండి మోదీకి ఓటు వేయని వారు దేశద్రోహులు అని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనే దేశానికి శ్రీరామ రక్ష అని, ప్రపంచ దేశాలు మోదీ నాయకత్వాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. బీజేపీ విజయ సంకల్పయాత్రలో భాగంగా సోమవారం జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఆయన మాట్లాడారు. కొందరు పెద్ద మాంసం బాగా తిని బీజేపీని ఓడించాలనే కుట్రతో బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేశారని ఓ వర్గాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారు. 'మీరు తినే తిండి ఫ్రీగా ఇస్తున్నది నరేంద్ర మోదీ.. మైనార్టీలకు ఫండింగ్ ఇస్తున్నది మోదీ.. షాదీ ముబారక్ పథకానికి, మైనార్టీ స్కూల్లో మీ పిల్లలు చదువుకోవడానికి నిధులు సమకూరుస్తున్నది కేంద్ర ప్రభుత్వం' అంటూ తన అక్కసు వెళ్లగక్కారు. 'మనం ఒక్క పెళ్లి చేసుకోవాడానికే తంటాలు పడుతున్నాం.. వాళ్లేమో నాలుగు పెళ్లిళ్లు చేసుకొని పదిమందిని కంటున్నారు' అంటూ వివాదాస్పదంగా మాట్లాడారు. రానున్న తరాలు సురక్షితంగా ఉండాలన్నా, మన పిల్లల్ని కాపాడుకోవాలన్నా, జనాభాను తగ్గించాలన్నా మోదీని గెలిపించుకోవాలని చెప్పుకొచ్చారు. జమ్ముకశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేశామని, త్వరలోనే ఉమ్మడి పౌరస్మృతి చట్టాన్ని తెస్తామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ దేశంలో మూతపడ్డ 68 చక్కెర కర్మాగారాలను తెరిపించిందని చెప్పారు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు తీసుకు వచ్చానని, పసుపు మద్దతు ధర రూ.13,700 పలుకుతుండటంతో రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు.

కాంగ్రెస్ అబద్ధాల కోరు

కాంగ్రెస్ అంటేనే అబద్ధాలకోరని 'వాడు గొర్రెలు తిన్నాడని, వీడు బర్రెలు తింటాడు. అంతే తేడా' అని అరవింద్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అంటేనే కరెంటు కట్ అన్నారు. దేశ భవిష్యత్తు కోసం ఓటేయాలని, తిండిపెట్టిన వారిని మర్చిపోవద్దని సూచించారు. ఉత్తర తెలంగాణపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి కోట్ల రూపాయల నిధులను తన నియోజకవర్గానికి తరలిస్తున్నారని ఆరోపించారు.

ఒక్కటైన వరంగల్ కార్పొరేటర్లు!

- పెండింగ్ పనులు పూర్తి చేసేలా ఒత్తిడి తేవాలని తీర్మానం
- మేయర్‌కు వినతిపత్రం అందజేత

అత్యవసరంగా సమావేశమైన గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు

వరంగల్, ఫిబ్రవరి 26: అభివృద్ధి పనుల సత్వర పూర్తికి వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ కార్పొరేటర్లు పార్టీలకతీతంగా ఒకటయ్యారు. మెజార్టీ ఉన్న బీఆర్‌ఎస్‌తోపాటు బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. సోమవారం వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో వీరంతా సమావేశమయ్యారు. ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులు సత్వరమే పూర్తి చేసేలా ఒత్తిడి తేవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అధికారులు, మేయర్ కార్పొరేటర్లను పట్టించుకోవడం లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికై మూడేండ్లవుతున్నా డివిజన్లలో రూ.50 లక్షల పనులు చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని మేయర్ గుండు సుధారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. పలు అంశాలపై ఆమెతో వాగ్వాదానికి దిగారు. కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుంటే బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరిస్తామని అల్టిమేటం ఇచ్చారు. అవసరమైతే అవిశ్వాసానికి వెనుకాడేది లేదని కార్పొరేటర్లు తేల్చిచెప్పారు.

ఏపీలో 8 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఫిరాయించిన 8 మంది ఎమ్మెల్యేలపై ఆయన అనర్హత వేటు వేశారు. వైఎస్సార్సీపీ వేసిన పిటిషన్‌తో ఆ పార్టీని వీడిన ఆనం రామనారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపైనా, టీడీపీ వేసిన పిటిషన్‌తో ఆ పార్టీని వీడిన మద్దాల గిరి, కరణం బలరాం, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేశ్‌పై అనర్హత వేటు వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

డీపీహెచ్‌లో జిల్లాకో న్యాయం!

- ప్రొబేషన్ కాలం ముగిసినా క్రమబద్ధీకరణకు నర్సుల ఎదురుచూపులు
- 2400 మందిలో 27 మందికే మోక్షం
- దందాకు తెరతీసేందుకేనని అనుమానం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖలో జిల్లాకో న్యాయం నడుస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2021లో ప్రభుత్వం 2,418 మంది స్టాఫ్ నర్సుల (నర్సింగ్ ఆఫీసర్లు)ను నియమించింది. అదే ఏడాది జూలై/ఆగస్టు నెలల్లో వారు విధుల్లో చేరారు. నిరుడు ఆగస్టు నాటికి వారి ప్రొబేషనరీ కాలం ముగియడంతో ప్రభుత్వం సర్వీస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభించి పోలీస్ వెరిఫికేషన్ కూడా పూర్తిచేసింది. క్రమబద్ధీకరణ ఉత్తర్వుల జారీయే మిగిలి ఉంది.

27 మందికే ఎందుకు?

మహబూబ్‌నగర్ జిల్లా డీఎంఈ పరిధిలో పనిచేస్తున్న 27 మంది నర్సింగ్ ఆఫీసర్లను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. వీరి క్రమబద్ధీకరణపై గత అక్టోబర్‌లో డీఎంఈ కార్యాలయం నుంచి డీపీహెచ్ కార్యాలయానికి ప్రతిపాదనలు అందగా, వారం క్రితం సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మిగతా 2,391 మంది అభ్యర్థులకు పోలీస్ వెరిఫికేషన్ పూర్తయి అక్కడితో ఆగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్యారోగ్యశాఖలో బదిలీల మాటున పెద్ద ఎత్తున దందా నడుస్తున్నదన్న ఆరోపణలకు తోడు, డీపీహెచ్ కార్యాలయంలో అవినీతి విచ్చలవిడిగా జరుగుతున్నదంటూ ఆడియో సైతం వైరల్ అయింది. 2021 బ్యాచ్ నర్సుల క్రమబద్ధీకరణను కొందరు దళారులు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం జరుగుతున్నది.

'అమృత్ స్టేషన్'కు మోదీ శ్రీకారం

- రాష్ట్రవ్యాప్తంగా 15 చోట్ల పనులకు శంకుస్థాపన

అమృత్ స్టేషన్ల ప్రారంభోత్సవంలో గవర్నర్ తమిళి సై, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ లక్ష్మణ్

న్యూస్‌నెట్‌వర్క్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని బేగంపేట్, యాకుత్‌పుర రైల్వేస్టేషన్‌లను అమృత్ స్టేషన్లుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. వాటికి సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ పథకంలో భాగంగా రూ.22.57 కోట్ల వ్యయంతో బేగంపేట్ స్టేషన్‌ను, రూ.8.53 కోట్ల వ్యయంతో యాకుత్‌పుర రైల్వే స్టేషన్‌లను అభివృద్ధి చేయనున్నారు. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో గల కాసిపేట రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని, బెల్లంపల్లి మండలం కన్నాల ప్రాంతంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం శివపూర్ బారేగూడలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కన్నాల ప్రాంతంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్నారు. రామంతాపూర్‌కు వెళ్లే దారిలో ఉన్న రైల్వే క్రాసింగ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కూడా ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేసినట్టు మెదక్ కలెక్టర్ రాజర్షి షా వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా జడ్చర్లలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, గద్వాలలో ఎంపీ రాములు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శిలాఫలకాలను ఆవిష్కరించారు.

రైల్వే అధికారులు అవమానించారు

- రైల్వే బోర్డు సభ్యుల ఆగ్రహం.. శంకుస్థాపన బహిష్కరణ

పెద్దపల్లి, ఫిబ్రవరి 26: ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా చేపట్టిన పెద్దపల్లి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని రైల్వే బోర్డు సభ్యులు, బీజేపీ నాయకులు బహిష్కరించారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా రూ.26.49 కోట్ల అంచనాతో చేపట్టనున్న పెద్దపల్లి రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి, ఆధునికీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించి, వేదికపైకి పిలువలేదని బోర్డు సభ్యులు, బీజేపీ నాయకులు పోల్సాని సంపత్‌రావు, రాజేశ్వర్‌రావు, దాడి సంతోశ్, మేకల శ్రీనివాస్, ఏ శ్రీకాంత్, కావేటి రాజగోపాల్, ఆవుల శ్రీనివాస్ రైల్వే అధికారులపై మండిపడ్డారు. ఇది కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమమని, కాంగ్రెస్ పార్టీ మీటింగ్ కాదని అసహనం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయారు.